ప్రజాశక్తి

సోమవారం 16 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తీరని వెతలు



తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ (ఫైల్‌ఫోటో)

- సాగునీటి వనరుల్లేక కరువు బారిన రైతులు
- పరిశ్రమల మధ్య నిర్వాసిత గ్రామాలు
- కాలుష్యంతో అనారోగ్య సమస్యలు
- అమలుకాని స్థానికులకు 75 శాతం ఉపాధి
- బ్రాండిక్స్‌లో ఇవ్వని రూ.10 వేలు వేతనం
- మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలు
- నేడు జిల్లాకు సిఎం రాక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా వున్నాయి. ఈ ఏడాది నిధుల సమస్యతో జలాశయాల నిర్వహణలేక శివారు ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సగం కూడా పంట వేయలేదు. వర్షాల్లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. 1,36,460 ఎకరాల్లో వరి సాగు కావాల్సి వుండగా లక్షా ఆరు వేల ఎకరాల్లో (78 శాతం) నమోదైంది. పది మండలాల్లో వర్షపాతం లోటు వుంది. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేస్తే తప్ప అనకాపల్లి జిల్లాకు సాగునీటి సమస్య తీరదు. సోమవారం జిల్లాలోని పరవాడ, అచ్యుతా పురంలో ముఖ్యమంత్రి జగ న్మోహన్‌రెడ్డి రెండు ఔషధ కంపెనీల ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటిస్తారన్న ఆశతో రైతులున్నారు. పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఫార్మా కంపెనీలకు ఆనుకొనివున్న తాడిని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో ఇళ్ల పట్టాల పత్రాలు పంపిణీ కార్యక్రమంలో సిఎం ఇచ్చిన హామీ ఒక్క అడుగూ ముందుకుపడలేదు. కంపెనీల మందుల కాలుష్యంతో జనం అనారోగ్యం పాలవు తున్నారు. ఎస్ఇజెడ్‌లో భూములు కోల్పోయిన గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించకపోవడంతో కాలుష్యంతో పరిశ్రమల మధ్య బతుకులు వెళ్లదీస్తున్నారు. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమకు అత్యంత సమీపంలోని చినపూడిలో భూగర్భ జలాలు కలుషితంకావడంతో ప్రజలు తాగునీరు కొనుక్కుంటున్నారు. అచ్యుతాపురం మండలంలోని పరిశ్రమల మధ్యలోనున్న దుప్పుతూరు, చినతాళ్లదిబ్బ ప్రజలకు పునరావాసం కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్న హామీ అమలుచేయలేదు.

అచ్యుతాపురం ఎస్ఇజెడ్, పరవాడ ఫార్మా, ఇతర పరిశ్రమల్లో విద్యార్హత కలిగిన నిర్వాసితులకు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు లభించడం లేదు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్న ప్రభుత్వ జిఒను అమలు చేయకపోవడంతో ఉపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఎన్ఎఒబి నిర్వాసిత మత్స్యకారులు, చేతివృత్తిదారులు, రైతులకు పూర్తిస్థాయి పరిహారం ఇవ్వలేదు.

శారద, వరహా నదుల్లో తెప్పలపై ఆధారపడి బతుకుతున్న వారికి రూ.2.50 లక్షల పరిహారం, ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు రేషన్ కార్డుకు రూ.1.30 లక్షలు చెల్లిస్తామన్న ప్యాకేజీ అమలుచేయలేదు. నిర్మాణ పనుల్లో నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడంతో ఉపాధికి వలసలు పోతున్నారు.

పరవాడ ఫార్మా మిగతా 2లో..



ప్రారంభానికి సిద్ధమైన ఇన్ఫోసిస్ కార్యాలయం

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

- నేడు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ముఖ్యమంత్రి బిజీబిజీ
- ఏర్పాట్లును పరిశీలించిన మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బిజీబిజీగా గడపనున్నారు. ఆయన పర్యటన ఖరారైన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లును రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం పరిశీలించారు. తొలుత ఐటి సెజ్‌లోని హిల్ నెంబర్-2 మీద ఏర్పాటు చేసిన ఇన్ఫోసిస్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను బీచ్ ఐటి డెస్టినీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ వంటి ఐటి దిగ్గజ సంస్థ ఇక్కడకు రావడం ఆనందంగా ఉందన్నారు. మరిన్ని ఐటి పరిశ్రమలు విశాఖకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఐటి ఉత్పత్తులలో విశాఖను సముచిత స్థానంలో నిలిపేందుకు జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బీచ్ క్లీనింగ్ కోసం మిగతా 2లో..

ప్రజా సమస్యలను పరిష్కరించరూ.. : సిపిఎం

వార్త 2లో..

కార్మికవర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

వార్త 4లో..

పలుచోట్ల 'న్యాయానికి సంకెళ్లు' నిరసనలు

వార్త 7లో..



మాట్లాడుతున్న ఎంబివికె ఛైర్మన్ మధు

విశాఖ వేదికగా డిసెంబర్‌లో బాలోత్సవ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చిన్నారులకు వివిధ రంగాలలో ఉన్న ఆసక్తులు గుర్తించి ప్రోత్సహించేందుకు విశాఖపట్నం వేదికగా బాలోత్సవ్ కార్యక్రమాన్ని డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో సెయింటాన్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు బాలోత్సవ్ కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. చిన్నారుల సామర్థ్యాలను వెలికితీసే వేదికగా ఇది నిలువనుందన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవ్ కార్యక్రమ ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.మధు మాట్లాడుతూ బాల బాలికలు సామాజిక మాధ్యమాల ఊబిలో చిక్కుకుని సెల్‌పోన్ ప్రపంచంలో మిగతా 2లో..

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత

వాల్తేరు రైల్వే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ రఘువీర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

రైలు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు వాల్తేరు డివిజన్ రైల్వే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ చుక్క రఘువీర్ తెలిపారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో 39వ ఆర్‌పిఎఫ్ రేసింగ్ డే వారోత్సవాలను ఇటీవల ఘనంగా నిర్వహించిన క్రమంలో ఆయన్ని 'ప్రజాశక్తి' కలవగా పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆర్‌పిఎఫ్ చేపడుతున్న చర్యలను వివరిస్తారా ?

అవాంఛనీయ సంఘటనలపై ప్రజల్లో ఆర్‌పిఎఫ్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. విస్తృతమైన ప్రజా చైతన్య యాత్రలు చేపట్టారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. రైల్ మాదత్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా గత ఏడాది కాలంలో 334 కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.76 లక్షల విలువైన సామాన్లును, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆభరణాలను తిరిగి ప్రయాణికులకు అందించాం. మాదక ద్రవ్యాల రవాణాకు సంబంధించి 62 కేసులు నమోదు చేశాం. 1482.39 కిలోల నిషిద్ధ వస్తువులను రికవరీ చేసి 109 మందిని అరెస్టు చేశాం.

ఇటీవల పట్టుకున్న పెద్ద కేసులేంటి ?

ఇటీవల కాలంలో మర్రిపాలెం యార్డులో రూ.1.6 కోట్ల విలువైన కాపర్ వైర్ల చోరీ కేసును ఛేధించాం.



1.5 కోట్ల విలువైన కాపర్ వైర్లను రికవరీ చేశాం. ఈ కేసులో విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీలలో 50 మందిని అరెస్టు చేశాం.



చోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి ?

గూడ్స్ రైళ్లలో చోరీలను అరికట్టేందుకు దంతెవాడ, కెకె లైన్లలో మూడు కమెండో యూనిట్లు నెలకొల్పాం. తద్వారా ఆ ప్రాంతంలో చోరీలు, మిగతా 2లో..

ప్రజా సమస్యలను పరిష్కరించరూ..

ముఖ్యమంత్రికి సిపిఎం బహిరంగ లేఖ

ప్రజాశక్తి - అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ప్రజానీకం పలు సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో లారస్ కంపెనీ యూనిట్ - 2 ప్రారంభానికి వస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డికి సిపిఎం నాయకులు బహిరంగ లేఖ రాశారు. ఆ వివరాలను పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రాము, జి.దేముడు నాయుడు, గనిశెట్టి సత్యనారాయణ ఆదివారం మీడియాకు వివరించారు. పునర్విభజన తరువాత అనకాపల్లి జిల్లా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడు తోందని పేర్కొన్నారు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్, పరవాడ ఫార్మా ఎస్ఇజెడ్‌లో పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఎక్కడా అమలు కాలేదన్నారు. నిర్వాసితులు, స్థానిక ప్రజల పట్ల కంపెనీల యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యధోరణితో ఉన్నాయన్నారు. రాంబిల్లి మండలంలోగల నేవీ (ఎన్ఎఒబి) నిర్వాసితులకు నేటికీ చట్ట ప్రకారం పరిహారం అందలేదన్నారు. భూ నిర్వాసితులకు, సముద్రంపై వేటాడే మత్స్యకారులకు, చేతివృత్తిదార్లుకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావల్సిన నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. శారద, వరహా నధుల్లో వేటాడేమత్స్యకారులందరూ గతంలో ఐదు నెలలు పాటు నిరసన కార్యక్రమం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేరలేదన్నారు. ఎన్ఎఒబి నిర్మాణ పనుల్లో కూడా నిర్వాసితులకు ఉపాధి కల్పించడంలేదని తెలిపారు. పరవాడ ఫార్మాసిటీలో డవలెపర్‌గా ఉన్న రాంకీ యాజమాన్యం వ్యర్థ రసాయనాలను సక్రమైన పద్ధతిలో శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదులుపెడుతోందన్నారు. దీంతో మత్స్య సంపద నాశనమవుతోందని తెలిపారు. సమీప గ్రామాల్లో ఉన్న చెరువుల్లోకి వ్యర్థ రసాయనాలను విడిచిపెట్టడం వల్ల వ్యవసాయం సాగు చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భ జలాలు కలుషితమై చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మంచినీరు తాగడానికి వీలులేకుండా ఉందని తెలిపారు. బఫర్‌జోన్, గ్రీన్‌బెల్ట్ నిబంధనలను రాంకీ యాజమాన్యం తుంగలోకి తొక్కిందన్నారు. తాడి గ్రామ తరలింపు హామీ నేటికీ నెరవేరలేదన్నారు. బ్రాండిక్స్‌లో విష వాయువులు లీకై కార్మికులు అస్వస్థతకు గురైన విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) స్పందించి సదరు కంపెనీ యాజమాన్యం రూ.10 కోట్లు పరిహారం చెల్లించాలని ఆదేశించినా అమలు కాలేదన్నారు. ఆ పరిహారానికి సంబంధించి అస్వస్థతకు గురైన మహిళా కార్మికులకు ఒక్కొక్కరికీ లక్ష రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. బ్రాండిక్స్‌లోని కార్మికులకు నెలకు రూ.10 వేలు ఇస్తామన్న హామీ కూడా నెరవేరలేదన్నారు. అచ్యుతాపురం మండలం పూడిమడకలో జెట్టి నిర్మాణం ఆచరణ రూపం దాల్చలేదని తెలిపారు. ఇదే మండలంలో పరిశ్రమల మధ్యలో వున్న చినపూడి, దుప్పుతూరు, చినతాళ్ళదిబ్బ గ్రామాల ప్రజలు తీవ్ర కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం ఎదురవాడ, గొర్లధర్మవరం గ్రామాల్లో పేదల నుంచి తీసుకున్న భూములకు నేటికీ పరిహారం ఇవ్వలేదని తెలిపారు. కొండకర్ల ఆవలో పూడిక తీయించాలన్నారు. అచ్యుతాపురం టు అనకాపల్లి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు, షాపులు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు.

అచ్యుతాపురం, పరవాడ ఎస్ఇజెడ్‌లలో ఫార్మా ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అచ్యుతాపురం కేంద్రంగా ఇఎస్ఐ వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని వెంటనే నిర్మాణం చేయాలన్నారు. ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయడంతో ఆ ఫ్యాక్టరీలపై ఆధారపడిన రైతులు, కార్మికులే కాకుండా వీరిపై ఆధారపడిన లక్షలాది మంది వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ మూడు ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించాలని, రైతులు పండించిన పంటలకు, బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

సమస్యలపై చర్చించే దమ్ముందా ?

రాష్ట్ర మంత్రులకు గంటా శ్రీనివాసరావు సవాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రులకు దమ్ముందా ? అని మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాలు విసిరారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం విశాఖకు సిఎం జగన్ వస్తున్నారని, అంతకు ముందు ప్రారంభమైన వాటినే మళ్లీ ప్రారంభిస్తున్నారని తెలిపారు. రుషికొండలో సిఎం క్యాంప్ ఆఫీసుకు వెచ్చించిన ఖర్చులు మీద సోషల్ మీడియాలో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయన్నారు. వీటిపై సమాధానం చెప్పాలన్నారు. పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నేటికీ పూర్తకాలేదన్నారు. విశాఖకు మెట్రో రైల్ ప్రాజెక్ట్ రాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైల్వే జోన్ కోసం పెద్దగా మాట్లాడిన వైసిపి నాయకులు ఇప్పుడు మాట్లాడటం లేదన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుపై నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం ఉద్యమం చేస్తున్న కార్మిక సంఘ ప్రతినిధులకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, నజీర్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి- కలెక్టరేట్ : అమెరికా సామ్రాజ్యవాద అండతో పాలస్తీనాపై దురాక్రమణ యుద్ధానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎస్ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్. భాను మాట్లాడుతూ అరబ్ దేశాలలో ఇజ్రాయిల్‌ను తన స్థావరంగా ఉంచుకొని, చమురు నిల్వలపై ఆధిపత్యం సాధించడం కోసం, అమెరికా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. ఇజ్రాయిల్ చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. విశ్వనాథ్, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. లలిత,జానకి,సతీష్, షణ్ముఖ్ పాల్గొన్నారు.

జగన్ పాలన అక్రమాలమయం

ప్రజాశక్తి-కలెక్టరేట్ : జగన్ పాలన అక్రమాలమయమని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విజనరీ చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి, జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉంచడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమ కేసుల్లో జైలుకెళ్లొచ్చిన సిఎం జగన్, అందరినీ జైలుకు పంపి కక్షసాధించుకుంటున్నారన్నారు. దేశవిదేశాల్లో 'బాబుతో మేము' అంటూ ప్రజలు అండగా నిలబడ్డారని, అదీ చంద్రబాబు సత్తా అన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై వైద్యులు ఇవ్వాల్సిన హెల్త్ బులిటెన్‌ను పోలీసులు, ఇతర అధికారులు ఇస్తున్నారన్నారు. జైల్లో ఫ్యాను, కనీస సౌకర్యాలు లేకుండా చేస్తూ, శిక్ష పడిన ఖైదీలతో సమానంగా చంద్రబాబును చూస్తూ కక్షసాధించడం బాధాకరమన్నారు.

బాబు పెట్టిన భిక్షతో రాజకీయంగా ఎదిగిన అమర్‌లాంటివారు చంద్రబాబుగురించి వ్యంగ్యంగా మాట్లాడడం బాధాకర మన్నారు.చంద్రబాబుని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రజలందరికీ వుందన్నారు. సమావేశంలో తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, పార్లమెంట్ కార్యదర్శి గణగళ్ళ సత్య పాల్గొన్నారు

జిఒ 21, 31లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్: ఆటో కార్మికులకు గుదిబండలుగా మారిన జిఒ 21, 31లను రద్దు చేయాలని ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముందుగా గురురాఘవేంద్ర ఆటో స్టాండ్ డ్రైవర్లు జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు షేక్ రెహమాన్ మాట్లాడారు.

మొదటి పేజీ తరువాయి..

తీరని వెతలు

సిటీలో ర్యాంకీ యాజమాన్యం రసాయన వ్యర్థాలను శుద్ధిచేయకుండా చెరువులు, సముద్రంలోకి విడిచిపెడుతోందని స్థానికులు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా కాలుష్య సమస్య తీరలేదు. 60 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఎకరా రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు పొందిన బ్రాండిక్స్ యాజమాన్యం 20 వేల మందికి మించి ఉపాధి కల్పించలేదు. ఉపాధి పొందిన వారికి సరైన వేతనాలు చెల్లించడంలేదు. కార్మికుని చేతికి నెలకు పదివేల రూపాయల వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంలేదు. అచ్యుతాపురం కేంద్రంగా వంద పడకల ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి హామీగానే వుంది. ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని ఎన్నికల ముందు, తరువాత మూసివేయడంతో చెరుకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా జిల్లా ప్రజానీకాన్ని పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఈసారైనా సిఎం వాటిపై స్పందిస్తారన్న ఆశతో పలువురు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత

అసాంఘిక కార్యకలాపాలు నివారించాం. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత నిమిత్తం 45 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ అనంతరం మరో 50 సీసీ కెమెరాలు అమర్చనున్నాం. ప్రతి ఎంట్రీ పాయింట్ వద్ద స్కానింగ్ ఏర్పాటు చేస్తాం. గడిచిన ఏడాది కాలంగా 127 మంది పారిపోయిన, తప్పిపోయిన పిల్లలను వారి సొంత ఇళ్లకు చేర్చాం. ఈ ఏడాది అక్రమంగా రిజర్వేషన్ టికెట్లు అమ్ముతున్న 50 మందిని అరెస్టు చేశాం.

విశాఖ వేదికగా డిసెంబర్‌లో బాలోత్సవ్

బాల్యాన్ని కోల్పోతున్నారన్నారు. బాలలకు ఆహ్లాదంతో పాటు సామాజిక స్పృహను పెంచేందుకు బాలోత్సవ్ కార్యక్రమం తోడ్పడనుందని తెలిపారు. చిన్నారుల ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించాలన్నారు. చిత్రలేఖనం, జానపద కళారూపాలు, నృత్య రూపకాలపై అవగాహన కల్పించాలన్నారు. బాలలు తమ సామర్థ్యాలను ప్రదర్శించాలని ఆరాట పడతారని, కానీ మోయలేని చదువుల భారాలతో సమయం కేటాయించలేక, సరైన వేదికలు లేక నిరాశకు గురౌతున్నారని పేర్కొన్నారు. భారత్ సర్జికల్స్ ఎమ్‌డి పి.రఘు అధ్యక్షతన జరిగిన ఆహ్వాన సంఘం సమావేశంలో రాష్ట్ర బాలోత్సవ్ సమన్వయకర్త మురళీకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎన్.దుర్గాప్రసాద్, వైఎల్ఎన్.రావు, వివిధ రంగాలకు సంబంధించిన సామాజిక వేత్తలు, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

సిఎం పర్యటనకు సర్వం సిద్ధం

ప్రత్యేకించి కొనుగోలు చేసిన ట్రాక్టర్లను కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించనున్నట్టు తెలిపారు. అమర్ వెంట మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ హరి వెంకట కుమారి తదితరులు ఉన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో నగరంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

పర్యాటకాభివృద్ధికి 'బ్రాండ్ విశాఖ'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడం కోసం 'బ్రాండ్ విశాఖ'ను బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు ప్రతిపాదించారు. విశాఖను ఉన్నత స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశాలపై చర్చించేందుకు ట్రావెల్, టూరిజం, హోటల్ రంగాలకు చెందిన వివిధ ప్రముఖులతో, ప్రతినిధులతో హోటల్ దసపల్లాలో ఆదివారం జరిగిన విజన్ విశాఖపట్నం 2030 చర్చలలో ఆయన మాట్లాడారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ఆదివారం మంత్రి అమర్‌ను ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షులు కెజి.రాఘవేందర్ రెడ్డి, జి.జనార్ధనరావు, అధ్యక్షులు బి.రవికాంత్ పాల్గొన్నారు.

సిక్కు కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ ఆనంద్

ప్రజాశక్తి- కలెక్టరేట్: వైసిపి సిక్కు మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నగరానికి చెందిన డాక్టర్ దిల్లా సింగ్ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ విడుదల చేసిన ఉత్తర్వులను వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి ఆదివారం ఆయనకు అందజేశారు. తనకు పదవినిచ్చిన సిఎం జగన్, వైవి.సుబ్బారెడ్డిలకు డాక్టర్ ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు.

హద్దులు తేల్చని అధికారులు

అయోమయంలో జగనన్న కాలనీవాసులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం, లోడగలవానిపాలెం పంచాయతీల హద్దులు తేల్చకపోవడంతో జగనన్న కాలనీవాసులు దేని పరిధిలోకి వస్తున్నారో తెలియక సతమతమవుతున్నారు. ఆనందపురం రెవెన్యూ పరిధిలో ఉండే లోడగలవానిపాలెం కొత్తగా పంచాయతీగా మారింది. పంచాయతీగా మారినా ఇప్పటివరకు నిశ్చితమైన బౌండరీలు నిర్ధారించలేదు. దీంతో హద్దులు విషయంలో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి.

ఇటీవల జగనన్న కాలనీ ఆనందపురం సర్వే నెంబరు 276 ఆనందపురం బాలికల వసతి గృహం సమీపంలో 102 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఈ స్థలంలో ఆనందపురం పంచాయతీకి చెందిన లబ్ధిదారులు గృహాల నిర్మించుకొని నివాసాలకు సిద్ధంగా ఉన్నారు. ఈ స్థలం లోడగలవానిపాలెం పంచాయతీకి సమీపంలో ఉండడంతో తమ పంచాయతీకి చెందుతుందని, ఇంటి పన్ను లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో ఇవ్వాలని ప్రతిపాదన వచ్చింది. జాతీయ రహదారికి అవతల ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో కొంత స్థలంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఈ సర్వే నెంబర్లు ఆనందపురం రెవెన్యూ పరిధిలో ఉండడంతో ఆనందపురం గ్రామస్తులకు ఇల్లు కేటాయించారు. రెండు చోట్ల ఆనందపురం పంచాయతీ గ్రామ ప్రజలకే ఇళ్ళ కేటాయించారని స్థలాలు మాత్రం లోడగలవానిపాలెం పంచాయతీ సమీపంలో ఉన్నాయని లోడగలవానిపాలెం గ్రామస్తులు ఇటీవల సర్వసభ్య సమావేశంలో పంచాయతీ సభ్యులు చెప్పడంతో ఈ వివాదం భీమిలి ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. పంచాయతీ హద్దులు లేక జగనన్న కాలనీ వాసులు ఇంటి పన్ను ఏ పంచాయతీలో కట్టుకోవాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. ఆనందపురం పంచాయతీకి చెందిన గ్రామస్తులకు ఇచ్చారు కనుక ఆ పంచాయతీకే చెందుతారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి వారిని ఆనందపురం పంచాయతీ పరిధిలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపుస్మాకు జ్యూరీ ఛాంపియన్‌షిప్ అవార్డు

ప్రజాశక్తి - ఆరిలోవ : నేషనల్ ఎడ్యుకేషన్ వరల్డ్ నిర్వహించిన ఇండియా స్కూల్స్ ర్యాంకింగ్స్ 2023 -24 ఏడాదికి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల సంఘం (అపుస్మా)కు ప్రతిష్టాత్మక నేషనల్ జ్యూరీ ఛాంపియన్ షిప్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని మారియాట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ (నిసా) అధ్యక్షులు కుల భూషణ్‌శర్మ ద్వారా అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి.రామచంద్రారెడ్డి అవార్డును అందుకున్నారు. దీంతో పాటు బడ్జెట్ స్కూల్స్ ర్యాంకింగ్ కేటగిరీలో విశాఖ ఆరిలోవ ప్రాంతానికి చెందిన భారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్ నామినేటెడ్ కావడంతో ఆ పాఠశాల అధినేత, అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు అవార్డు తీసుకున్నారు. ఈ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవి.రావు

జనసేన రాక్స్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సందీప్ పంచకర్ల

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బీపీ కల్లాలు రోడ్డులో శుభశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జనసేన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని హైదరాబాద్ వైజాగ్ రాక్స్ ఆధ్వర్యాన ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథులుగా పార్టీ భీమిలి ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. రానున్నది జనసేన ప్రభుత్వమేనని చెప్పారు. హైదరాబాద్ రాక్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, గాజు గ్లాస్ గుర్తును ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం సందీప్ పంచకర్ల సమక్షంలో బిపి కల్లాలు, పాలవలస, గొట్టుపల్లికి చెందిన పలువురు జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన హైదరాబాద్ రాక్స్ కమిటీ ప్రతినిధులు జి.శివ, వివిఎస్ఎన్ మూర్తి, రాంబాబు, సత్తిబాబు, వైజాగ్ రాక్ సభ్యులు గోవింద్, విజయ్, చంద్రరావు, ఆనందపురం నాయకులు తమ్మిన అప్పలరాజు, తాడివాడ శివకృష్ణ, గొలగాని బాలు,కోరుకొండ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి తహశీల్దారు కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా పోలీసు కమిషనర్ రవిశంకర్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేపట్టారు. గోదాములో ఉన్న ఈవీఎం మిషన్లు, వాటి పనితీరును, సిసి కెమెరాల నిర్వహణ గదిని, పరిశీలించారు. భద్రతా పరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సిపి రవిశంకర్

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చనను అర్చకులు ఆలయ భాండాగారం నుంచి బయటకు తీసి బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వర్ణ పుష్పార్చనను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎఇఒ డి.భ్రమరాంబ, పర్యవేక్షకులు వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

రేవంత్ కుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్‌కుమార్ (6) రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు సాధించినందుకు ఆదివారం జనసేన నాయకులు సన్మానించి రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. వేమనవలస బిపి కల్లాలు రోడ్డు శుభశ్రీ కళ్యాణ మండపంలో జనసేన ఆత్మీయ సమావేశంలో రేవంత్ కుమార్ కోచ్ టి.సాయికుమార్‌ను సన్మానించారు. జనసేన మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు విద్యార్థికి రూ.5000 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, రేవంత్ తల్లి కుప్ప రామలక్ష్మి, మడసల శ్రీను, పిన్నింటి సన్యాసిరావు, బంటుబిల్లి సాధురావు, అప్పలనాయుడు, గండ్రేటి దుర్గ, టి.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియంతను గద్దె దించాలి : టిడిపి

ప్రజాశక్తి-పద్మనాభం : నియంత పాలకుడ్ని గద్దె దించాలని టిడిపి భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు విజ్ఞప్తిచేశారు. మండలంలోని పొట్నూరులో శనివారం రాత్రి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టిందన్నారు. జగన్ పాలనతో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోరాడ రమణ, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కె.దామోదరరావు, పార్టీ సభ్యులు ఎం.నందీశ్వరరావు, కెవి.సత్యనారాయణ, కె.శ్రీను, పి.శ్రీను, ఆర్.సన్యాసిరావు, కె.ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘూన్సీకి రైతునేస్తం పురస్కారం

ప్రజాశక్తి -మధురవాడ : సేంద్రియ విధానంలో మిద్దె తోటను నిర్వహిస్తూ పలువురికి మార్గదర్శకంగా నిలిచినందుకు బంగారు ఘూన్సీకి పద్మశ్రీ ఐవి సుబ్బారావు రైతునేస్తం 2023 పురస్కారం దక్కింది. ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం కృష్ణాజిల్లా, ఆత్కూరు గన్నవరం వద్ద ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రైతు నేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు ద్వారా బంగారు ఘూన్సీ పురస్కారం అందుకున్నారు. బంగారు ఘూన్సీ మధురవాడలో సుమారు ఎనిమిదేళ్లుగా మిద్దె తోటను నిర్వహిస్తున్నారు. రైతు మాదిరిగానే శ్రమిస్తూ ఇంటి పంటకు అవసరమైన సేంద్రియ ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకొంటూ రసాయన రహిత ఆహారాన్ని వినియోగిస్తున్నారు. ఇంటిపంటలో విత్తన ప్రాముఖ్యతను గుర్తించి విత్తనాలను సేకరిస్తూ, నిల్వ చేస్తూ తాము వినియోగించుకోవడంతో పాటు తోటి ఇంటి పంటదారులకు కూడా అందిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ఎంవివి సిటీ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... అడవివరం ప్రాంతానికి చెందిన ఉదయ్ కుమార్ (33), జగన్మోహన్‌తో కలిసి పోతిన మల్లయ్యపాలెంలోని ఎంవివి సిటీ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అదే మార్గంలో వస్తున్న కారు ఎంవివి సిటీ దగ్గర ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగన్మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జగన్మోహన్‌ను పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు. పిఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - ఆరిలోవ : సాగర తీరం జోడుగుళ్లపాలెం సమీపంలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం ఆదివారం ఉదయం కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక వివరాలు సేకరించారు. మృతుని ముఖంపై గాయాలు కనిపించాయి. అలలు తాకిడికి రాళ్ళకు గుద్దుకోవడంతో ఆ గాయాలు అయి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారంలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన పల్లా మమత (16) ఈ నెల 13 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఎర్రమ్మ శనివారం రాత్రి పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక అనంతవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో 9 తరగతి చదువుతోంది. ఎఎస్ఐ నక్కా శ్రీనివాసరావు కేసు నమోదుచేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : నాతయ్యపాలెం జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ ఎదుట రెండు కార్లు ఢీకొన్నాయి. గాజువాక నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వైపు రెండు కార్లు ప్రయాణిస్తున్నాయి. విశాఖ డెయిరీ సమీపంలో ముందు కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే మొబైల్ టీమ్ వారిని ఆసుపత్రికి తరలించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకునికి గాయాలు

ప్రజాశక్తి -పద్మనాభం : విద్యుదాఘాతంలో దువ్వు విష్ణు (23) తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి గొల్లలపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఒక రైతు విద్యుత్ లేదని లైన్‌మ్యాన్ రామకృష్ణకు శనివారం ఫోన్‌చేశాడు. లైన్‌మ్యాన్ తనకు సహాయకునిగా ఉంటున్న దువ్వు విష్ణు(23)కు ఫోన్ చేసి విద్యుత్ సమస్య పరిష్కరించాలని సూచించాడు. సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పనిచేస్తుండగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలు పాలయ్యాడు. లైన్‌మ్యాన్, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకొని విష్ణును 108 సహకారంతో ఆస్పత్రికి తరలించారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ శిల్పారామంలో దసరా ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నృత్య భారతి డాన్స్ అకాడమీచే శాస్త్రీయ జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఇందులో భాగంగా గణనాయక, శుక్లాం భరదరం విష్ణు, ఎందరో మహాను భావులు, గురు బ్రహ్మ, రాజు ముఖి, వేయి నామాలవాడు, కొలువైతివారంగ సాయి, అష్ట లక్ష్మి, నవ దుర్గ, సీతాకళ్యాణం, మొక్క జొన్న తోటలో తదితర అంశాలను ప్రదర్శించారు. వాత్సల్య, కృతిశ్రీ, వర్షశ్రీ, హారిక, హాసిని, సునీత, ప్రణతి, స్వప్న, శృతి, సాత్విక, దీక్షిత, లిఖిత, నాగశృతి, గీతిక, దేవిశ్రీ కళాకారులు నృత్యాలు ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు.

95 మందికి హోమియో మందులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం భీమిలి, చినబజారులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ముందుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన 95 మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బెహరా భాస్కరరావుకు వినతిపత్రం అందిస్తున్న బాధిత కుటుంబీకులు

మా గోడు పట్టించుకోండి

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎస్‌టిఎల్ నుంచి లక్ష్మీనగర్ ఇందిరానగర్ మీదుగా గోపాలపట్నం పెట్రోల్ బంకు వరకు నిర్మాణం తలపెట్టే బైపాస్ రోడ్డు విస్తరణకు సహకరిస్తామని, కానీ తమ గోడును కూడా ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతూ జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుకు బాధిత కుటుంబీకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అభివృద్ధికి అడ్డుచెప్పబోమని, దశాబ్దాల నుంచి నివాసముంటున్న తాము ఇప్పుడు ఇళ్ల కోల్పోవడం తీవ్ర నష్టమని, తమకు నష్టపరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి సహకరించాలని కోరారు. దీనికి బెహరా భాస్కరరావు స్పందిస్తూ అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మనాపల్లి త్రినాధరావు, కడిమి రామకృష్ణ, మార్కండేయ రాజశేఖర్, కోనేటి శ్రీను, బండి దుర్గేష్ పాల్గొన్నారు.

అదనపు అంతస్తుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం వైఎస్ఆర్ నగర్‌లో ఉన్న సామాజిక భవనంపై రూ.57.38 లక్షలతో అదనపు అంతస్తు, సౌకర్యాల కోసం ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ కంపా హనూక్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కెకె.రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుందన్నారు. వార్డులో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజు, నాయకులు పైడి రమణ, కిరణ్ రాజు, డిఇ భరణి, ఎఇ పాల్గొన్నారు.

మనువాద భావజాలంతో అసమానతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : మనువాద భావజాలం మనుషుల మధ్య అసమానతలకు, హింసకు కారణమైందని హేతువాద సంఘ నాయకుడు పెనుమత్స సుబ్బరాజు పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో దళిత హక్కుల సమాఖ్య ఆధ్వర్యాన 'రావణుడే- మహనీయుడు' అంశంపై ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ, మంత్రాలు, తంత్రాలు పేరుతో ప్రజల మెదడును కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. ఎయు ప్రొఫెసర్ పిడి.సత్యపాల్ మాట్లాడుతూ, హిందూ ధర్మం పేరుతో ఆధ్యాత్మిక ఫాసిజం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ డాక్టర్ మాటూరి శ్రీనివాస్, కొరివి సుందరరావు, గౌతమి, సుర్ల వెంకటరమణ, బొడ్డు కల్యాణరావు, కె.రవి, ఎస్ఆర్.వేమన, నూకరాజు ప్రసంగించారు.

మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కలిసిన జియ్యాని

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ వచ్చిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని పలు ప్రధాన అంశాలపై ఆయనతో చర్చించారు.

సింహగిరిపై ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయానికి అనుబంధ దేవాలయమైన త్రిపురాంతక స్వామి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నెమలిపురికి మంత్రి బొత్స అభినందన

ప్రజాశక్తి -తగరపువలస : ఎయు ఆంగ్ల విభాగంలో జైలు సాహిత్యంపై పరిశోధనకు గాను అంతర్జాతీయ గుర్తింపు పొందిన స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాల ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెమలిపురి సత్యనారాయణను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. ప్రపంచ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఇటీవల మంత్రి నెమలపురిని అభినందించి జ్ఞాపిక అందజేశారు.

భువనేశ్వరికి టిడిపి నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి -భీమునిపట్నం : చంద్రబాబు భార్య నారా భువనేశ్వరిని పలువురు టిడిపి జిల్లా నాయకులు ఆదివారం రాజమండ్రిలో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్ పి.వి.నరసింహం, నాయకులు గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు తదితరులున్నారు.

కార్మికవర్గంపై దాడిని ఐక్యంగా ఎదుర్కోవాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కార్మికవర్గంపై కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి చేస్తున్న దాడిని ఐక్యంగా ఎదుర్కొనేందుకు కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల సిఐటియు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా కార్మిక వర్గంపై దాడి చేస్తోందన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టే విధానం అమలు చేస్తోందని తెలిపారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్పుతోందన్నారు. కార్మికులకు వేతనాలు తగ్గించడం, ఉపాధికి రక్షణ లేకుండా చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్రం చేసే చట్టాలు, విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వ్యతిరేకించకపోగా వాటి అమలుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూడా బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హిందూత్వ



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కార్పొరేట్ విధానాలపై కార్మికవర్గాన్ని చైతన్యం చేసే విధంగా పనిలో మార్పు రావాలని పేర్కొన్నారు. నవంబర్‌లో జరిగే మహాపడావ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉత్తరాంధ్ర నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, కాకి సురేష్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, అమ్మన్నాయుడు, ఉమామహేశ్వరరావు, మన్మధరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50, 51వ వార్డుల పరిధి మాధవధార జంక్షన్‌లో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, కంచరపాలెం జోన్ సిఐటియు సెక్రెటరీ ఒ.అప్పారావు మాట్లాడుతూ, పారిశుద్ధ్యం, కార్మికుల ఆరోగ్య భరోసా ఖర్చుల నిధులు విడుదల చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఏడు నెలల బకాయి హెల్త్ అలవెన్సు చెల్లించాలని, ఆప్కాస్ ద్వారా ప్రతినెలా మిస్సింగ్ అవుతున్న జీతాలు చెల్లించాలని, డెత్ పోస్ట్, సిక్కు పోస్టులను వెంటనే సంబంధిత వారసులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత నెల 16వ తేదీన జరిగిన సమ్మె ఒప్పందాల మినిట్స్ వెంటనే అమలు చేయాలని, ఆప్కాస్‌లో విలీనం కాక ముందు ఉన్న బకాయి జీతాలు, హెల్త్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రావణ్‌కుమార్, బి.లక్ష్మణరావు, ఈశ్వరరావు, శంకర్, సారిక రాము, శివ, ఎంకె.లక్ష్మి, అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాపుసంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -గాజువాక : కృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సంఘం అధ్యక్షులు జెర్రిపోతుల ముత్యాలు కోరారు. నడుపూరు కళావేదికలో సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆరేళ్లుగా ఈ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, భారీ వనసమారాధనలు చేశామని తెలిపారు. ముఖ్యంగా సంఘం బలోపేతం, సభ్యత్వ నమోదు, డిసెంబర్‌లో జరుగు వనసమారాధన గురించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తటారి వెంకటరమణ, కర్రం అప్పలస్వామినాయుడు, గల్లా అమ్మాజి, ఎం.స్వప్నకుమారి, సియ్యాద్రి కనకారావు, ఇందల దేముడు, యలమంచిలి సంజీవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెర్రిపోతుల ముత్యాలు

పునర్నిర్మించిన స్నేపర్ పార్కు ప్రారంభం



పునర్నిర్మించిన స్నేపర్ పార్కును ప్రారంభిస్తున్న వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి సీతమ్మధారలో రూ.2.50 కోట్లతో పునర్నిర్మించిన స్నేపర్ పార్క్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో మనిషి ఆరోగ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, మేయర్ హరివెంకటకుమారి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, టిడ్కో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రసన్న కుమార్, వైసిపి నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథం, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

తేజస్వినికి సత్కారం

ప్రజాశక్తి-పెందుర్తి : నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన 92వ వార్డు పద్మనాభనగర్‌కు చెందిన మాటూరు తేజస్వినిని జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు సత్కరించారు. తేజస్విని ఆదివారం భాస్కరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంచిపాటి జగదీష్‌కుమార్, త్రినాథ్, కడిమి రామకృష్ణ, కోనేటి శ్రీను, తెలుకల రమేష్, మార్కండేయ, రాజశేఖర్, జమాన్ శ్రీను పాల్గొన్నారు.

దల్లేరీ వాతే ప్రేమ గీతం ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : తారా బలరాం క్రియేషన్స్‌లో పల్లవి లిడిపి సమర్పించిన దల్లేరీ వాతే (మనసులోని మాట) అనే సరికొత్త ప్రేమ గీతం బంజారా పాటను కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.మురళీధర్‌రెడ్డి ఆదివారం పేజ్ -6లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతంలో పాటను చిత్రీకరించడం అభినందనీయమన్నారు. ఈ పాటను శేష సింగరాయకొండ దర్శకత్వంలో బలరాం సభావత్, స్నేహ హీరో హీరోయిన్లుగా నటించారు. వెంకట్ అజ్మీరా సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.కుమార స్వామి, జి.ఆనంద్, ఎం.గోపాల్, బి.వెంకటేశ్వర్లు, బి.కృష్ణ, ఆర్.నర్సింహ, ఎన్.నర్సింగరావు, టి.ప్రభాకర్, విద్యుత్‌కుమార్ వర్మ, శంకర్ నాయక్ హాజరయ్యారు.

పేదలకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి -ములగాడ : హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ సిఐఎస్ఎఫ్ విభాగం ఆధ్వర్యాన నిరుపేదలకు నిత్యావసర సరుకులను డిప్యూటీ కమాండర్ ఒరేయ్ వినోద్ కుమార్ బిస్త్ ఆదివారం పంపిణీచేశారు. సిఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం వల్ల వారి కుటుంబాల ఆకలి తీరుతుందన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి- తగరపువలస : 50 మంది పేదలకు టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యాన ఆదివారం ఆహార పొట్లాలు అందజేశారు. గ్రూప్ సభ్యులు శ్యామ్ సుందర్ ఆర్థిక సాయంతో వీటిని అందజేశారు. టీచర్స్ హెల్ప్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షులు మరగడ రామకృష్ణ, సభ్యులు కె.ముత్యాలరావు, పి.శ్రీనివాసరావు, శ్యామలాంబదేవి పాల్గొన్నారు.

ఫార్మా వ్యర్థాలతో పరేషాన్!

- విష వాయువు, కలుషిత జలాలతో జీవితాలు బుగ్గిపాలు
- అర్థాయుస్సుతో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు
- ప్రభుత్వాలు మారుతున్నా, కానరాని పరిష్కారం
- ఫార్మా యాజమాన్యంతో నేతలు, అధికారుల కుమ్మక్కు
- సిఎం జగన్ స్పందించాలని జనం వేడుకోలు



రాంకీ ఫార్మా వ్యర్థాలతో నీరు కలుషితమైన పరవాడ ఊరచెరువు

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ రాంకీ ఫార్మా కంపెనీలు వెదజల్లుతున్న విష వ్యర్థజలాల వలన పరవాడ రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫార్మా యాజమాన్యం ఇష్టానుసారంగా విడుదల చేసే వ్యర్థాలు కాలువల ద్వారా ఊరచెరువులోకి చేరుతున్నాయి. అక్కడి నుంచి ఫ్లోటింగ్ వాల్, గెడ్డవాగుల ద్వారా కిందనున్న బొడ్డుమాను చెరువులోకి చేరుతోంది. ఆ చెరువు పొంగితే, పరవాడ కోనాం చెరువులో చేరి అది నిండి పక్కన ఉన్న రాతి చెరువులోకి వ్యర్థాలతో కూడిన జలాలు చేరుతాయి. అక్కడ నుండి సన్యాసి చెరువులోకి దాని ద్వారా పెద్ద చెరువులోకి వ్యర్థ జలాలు ప్రవహిస్తాయి. ఇలా చెరువులన్నింటినీ నిండిన తర్వాత ఊటగెడ్డ ప్రాంతం ద్వారా రాంకీఫార్మా వ్యర్థాలన్నీ సముద్రతీరానికి చేరి, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నాయి.

పరవాడ పరిసర ప్రాంతాల్లో చెరువులపై ఆధారపడి 500 ఎకరాలకు వ్యవసాయ భూములు సాగుచేస్తున్నారు. ఫార్మా వ్యర్థాలతో నిండిన చెరువుల్లోని నీటినే పంటలకు వాడుతుండడంతో, ఈనీటితో పండించిన చిరుధాన్యాలు, కూరగాయలు, ఇతర పంటలు ప్రజలు తినడంతో కిడ్నీలు, గుండె సంబంధ రోగాలు,కేన్సర్ వంటి రోగాల బారినపడి అల్లాడడంతోపాటు మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

అదే విధంగా పరవాడ పెద్దచెరువులోని చేపలు ఫార్మా విష వ్యర్థాలతో చనిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితితో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. ఫార్మా విష వ్యర్థ జలాల అనర్థాలపై స్థానిక రైతులు అనేక సార్లు ఫిర్యాదులు, ధర్నాలు, ఆందోళనలు చేశారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, పరిశీలించి నమూనాలు సేకరించి తీసుకుని వెళుతున్నారే తప్ప తదుపరి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరిస్తామని చెబుతున్న అధికారులు, నేతలు ఆదిశగా చర్యలైతే చేపట్టడం లేదు. రాంకీ


చెరువుల్లోని కలుషిత జలాలతో సాగుచేస్తున్న వరిపైర్లు

యాజమాన్యంపై చర్యలకు ఎందుకు వెనకాడుతున్నారో, దీనివెనుకున్న మర్మమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యేకు రైతులు, ప్రజలు మొరపెట్టుకుంటే, వచ్చి, పరిశీలిస్తానని హామీ ఇచ్చినా, అటువైపు రాలేదని రైతులు చెబుతున్నారు. ఫార్మా వ్యర్థాల వల్ల చెరువుల్లోని చేపలు, దిగువనున్న పంటలు పాడౌతున్నాయని పెద్దచెరువు సంఘం అధ్యక్షులు రామచంద్రరావు నిరాహారదీక్ష చేపట్టి, చేపల చెరువు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫార్మా యాజమాన్యాలు దిగొచ్చి సమస్య పరిష్కరిస్తామని, చుక్క నీరు కూడా చెరువులోకి రాకుండా అడ్డుకట్ట వేస్తామని హామీనిచ్చి నిరాహార దీక్ష నుంచి విరమింపజేసి, మూడేళ్లు కావస్తున్నా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోగా, వ్యర్థాలను యథావిధిగానే చెరువుల్లోకి వదిలేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉఉన్నారు. ఈ నేపథ్యంలో పరవాడ పర్యటన వస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఈ సమస్యపై స్పందించాలని రైతులు, ప్రజానీకం కోరుతున్నారు.

ఆదివాసీల గోడు పట్టించుకోండి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో బహిరంగలేఖ

ప్రజాశక్తి -అనకాపల్లి :అనకాపల్లి కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో మిగిలిపోయిన నాన్‌షెడ్యూల్, షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు. ఈనెల 16న సోమవారం ముఖ్యమంత్రి జగన్ అనకాపల్లి జిల్లా పరవాడలో పర్యటన సందర్భంగా తమ గోడు పట్టించుకోవాలంటూ, 'ముఖ్యమంత్రి గారు...అనకాపల్లి జిల్లా ఆదివాసీల గోడు వినండి' అంటూ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా విడిపోయిన తర్వాత అల్లూరి జిల్లాలో పాడేరు ఐటిడిఎ ఉండిపోవడంతో, అనకాపల్లి జిల్లాలో గిరిజనులకు ఐటిడిఎ సేవలు అందకుండా పోయాయన్నారు. ఈ నేపథ్యంలో కొత్తజిల్లా అనకాపల్లిలో సాగులో ఉన్న భూముల నుంచి ఆదివాసీలను చట్ట విరుద్ధంగా తొలగించే ప్రయత్నాలు ఊపందుకున్నాయని, దీనిపై జగనన్నకు చెబుదాంలో విన్నవించినా ఎటువంటి చర్యలు లేవన్నారు. అన్నిజిల్లాల్లో ఆదివాసీలు, గిరిజనులకు ఐటిడిఎ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందుతుంటే, అనకాపల్లి జిల్లాలో ఆ పరిస్థితి లేదన్నారు.దీనిపై తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఫార్మా పరిశ్రమల్లో భద్రతా చర్యలపై ముఖ్యమంత్రి స్పందించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ: పరవాడ ఫార్మసిటీలో కార్మిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. దీనిపై పరవాడ ఫార్మాసిటీలో నిరసన చేపట్టారు. సోమవారం పరవాడ ఫార్మాసిటీ విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, 15ఏళ్లుగా సవరణకు నోచుకోని కార్మికులకు కనీస వేతన జిఒను తక్షనం సవరించి అమలు చేయాలని, ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు జరిగేలా భద్రత ఆడిట్ నిర్వహించాలని కోరారు. ప్రమాదానికి గురైన కార్మికుల వైద్యానికి పరవాడలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. కార్మిక చట్టాలు అమలయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో సిఐటియు నాయకులు కె.రమణ, జి చిట్టిబాబు, ముసిలి నాయుడు. పాల్గొన్నారు

జీవన విధానం మార్పుతో మధుమేహం నియంత్రణ

ప్రజాశక్తి-.అనకాపల్లి : జీవన విధానం మార్పుతో మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని మధుమేహ నిపుణులు డాక్టర్ దివాకర్, డాక్టర్ మానస తెలిపారు. ఆదివారం అనకాపల్లి పార్క్ సెంటర్ వద్ద ఆరోగ్యమే మహాభాగ్యం సంస్థ ఆధ్వర్యంలో శ్రీ భవిత ప్లేస్కూల్‌లో సుగర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన, నియంత్రణకు వ్యాధిపీడితులతో సదస్సు నిర్వహించారు. డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ సుగర్ వ్యాధి నియంత్రణకు ఆహార నియమాలతోపాటు ప్రతిరోజూవ్యాయామం, నడక అవసరమని, మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన జీవనం గడపాలని సూచించారు. ప్రాణాపాయాన్ని తెచ్చి పెట్టే మధుమేహ వ్యాధిరాకుండా అప్రమత్తత అవసరమని, వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ దివాకర్ సూచించారు. కార్యక్రమంలో బొడ్డు వెంకట అప్పారావు, పి గాంధీ, కొనసాల కష్ణ అప్పారావు, కొంత శ్రీనివాసరావు మల్లికార్జున్, అప్పారావు భాస్కర్, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు అభినందన

ప్రజాశక్తి- చోడవరం : ఉత్తరప్రదేశ్ నొయిడాలో జరిగిన జాతీయస్థాయి క్యొరుగి, పూమ్‌సే తైక్వాండో పోటీల్లో ఆంధ్రాతరపున ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన, 18మందిలో తొమ్మిది మంది చోడవరానికి చెందిన వారు కావడం గర్వకారణమని టిడిపి నేతలు అన్నారు. ఆదివారం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కాడెట్, సబ్ జూనియర్ పూమ్‌సే డివిజన్‌లో ఎం.హేమశ్రీ , కొల్లిపార తన్విత్‌ఉదయ్, గండి కారుణ్య సందీప్ రజత, కాంస్య పతకాలు, కాడెట్ క్యొరుగిలో జివి శశివర్ధన్‌కుమార్, సబ్ జూనియర్‌లో ఎస్.షారూన్, ఆర్.దీక్షిత కాంస్య పతకాలు, జి నాగసాయిరామ్, ఎస్ వెంకటేష్ పతకాలు సాధించారు. విజేతలతోపాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, కోచ్‌పల్లం మురళీకృష్ణ, కోచ్‌లు కె ప్రదీప్ కుమార్,


విద్యార్థులను అభినందిస్తున్న టిడిపి నేతలు

సంతోషి లక్ష్మి, గండి శేఖర్ బాబు, ఆస్లాం, నోకియా ప్రసాద్‌లనుమాజీ ఎమ్మెల్యే కెయస్‌యన్‌యస్ రాజు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనురు మల్లునాయుడు, పెదబాబు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చోడవరం మండల టిడిపి కార్యదర్శి ముడుసు గోవింద్, గాంధీ గ్రామ టిడిపి కార్యదర్శి దండా గోవింద్ పాల్గొన్నారు.

అయ్యన్న స్కూల్‌కు జ్యూరీ అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఇండియా స్కూల్స్ ర్యాంకింగ్స్ 2023-24లో బడ్జెట్ స్కూల్స్ విభాగంలో గ్రామీణ ప్రాంతంలోని అయ్యన్న స్కూల్ నామినేట్ అయి, పాఠశాల కరెస్పాండెంట్, డాక్టర్ ఖాసిం జ్యూరీ అవార్డు అందుకున్నారు. అలాగే న్యూఢిల్లీలో మారియట్ హోటల్‌లో నేషనల్ ఎడ్యుకేషన్ వరల్డ్ నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్ (నిసా) ప్రెసిడెంట్ కులభూషణ్ శర్మ ప్రతిష్టాత్మక నేషనల్ జ్యూరీ అవార్డు-2023-24ను అపుస్మా రాష్ట అధ్యక్షులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి.రామచంద్రారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట ప్రతినిధులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా జగనన్న లేఅవుట్లు


బుచ్చయ్యపేటలో అసంపూర్తి ఇళ్ల పరిశీలనలో జనసేన నేతలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జగనన్న లేఅవుట్‌లలో అవినీతి అక్రమాలు జరిగాయని చోడవరం నియోజకవర్గ జనసే ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు ఆరోపించారు. ఆదివారం మండలంలో గల కందిపూడి, బుచ్చయ్యపేట, ఎల్.బి.పురం, వడ్డాది జగనన్న లేఅవుట్లను పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డాదిలో జగనన్న ఇంటి పట్టాల మంజూరులో అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. శాస్త్ర కన్స్ట్రక్షన్స్ అనే బినామీ కాంట్రాక్టర్ లబ్ధిదారుల నుంచి రూ.25వేలు వసూలు చేసి, పునాదుల వరకుకట్టి, ఇపుడు రూ.లక్ష ఇస్తేనే ఇళ్లు నిర్మాణం చేస్తామంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న ఇళ్ల నిర్మాణం ప్రచార ఆర్భాట కార్యక్రమంగా, లబ్ధిదారుల ఎంపిక నుంచి నిర్మాణాలు, బిల్లుల వరకు వైసిపి అవినీతి, అక్రమాలకు నెలవుగా మారిందని ఆరోపించారు. ఎల్‌బిపురం కందిపూడి బుచ్చయ్యపేట తదితర గ్రామాల్లో అరకర సౌకర్యాలతో లబ్ధిదారులు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు.

లోపభూయిష్టంగా జగనన్న ఇళ్ల నిర్మాణం

చోడవరం : వైసిపి నవరత్న పథకాల్లో ఒకటైనే పేదలకు జగనన్న ఇళ్ల పథకం చోడవరం నియోజకవర్గంలో అత్యంత లోపభూయిష్టంగా అసంపూర్తి నిర్మాణాలతో ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు ఆరోపించారు. మండలంలోని గోవాడ, చోడవరం, నరసయ్యపేట, గౌరీపట్నం తదితర గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను పరిశీలించారు నర్సయ్య పేట బిట్ 2లో నరసయ్యపేట, గాంధీ గ్రామం, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో తీవ్రమైన అవినీతి చోటుచేసుకుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డిఎస్.నాయుడు, గూనూరు మూలునాయిడు, ప్రధాన కార్యదర్శి అల్లం రామఅప్పారావు, నందవరపు రమాదేవి, కర్రిరమేష్, దాడి వెంకటఅప్పారావు, కెఎస్‌నాయుడు, దేముళ్లనాయిడు, నరవ సరోజిని, తుమ్మపాల రమేష్ , దొండా సాయి, గుండు గణేష్ , పల్లా వెంకట రమణ, నందవరపు రమాదేవి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మునగపాక సంతబయలులో లారస్ కంపెనీ ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన మార్కెట్ యార్డును ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, లారస్ అధినేత చావా నరసింహారావు, వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలాది మంది కార్మికులకు ఉపాధినిస్తున్న లారస్ యాజమాన్యం, ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. బొడ్డేడ ప్రసాదరావు మాట్లాడుతూ, మునగపాకను లారస్ కంపెనీ దత్తత తీసుకుని సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, లారస్ ప్రతినిధులు చావా సత్యనారాయణ, చావ సౌమ్య, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి మండల ఆడారి గణపతి అచ్చం నాయుడు, పొలిమేర గణేష్, ఎంపిటిసిలు సూరిసెట్టి రాము, బోడకుర్తి గణేష్, పిల్ల అప్పారావు, ఆడారి కాశి బాబు పాల్గొన్నారు.

కల్యాణగిరిపై ఎంవిఆర్ మాలాధారణ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణ పురం, కల్యాణగిరిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరావు ఆదివారం యువసేన సభ్యులతో కలిసి 108 రోజుల మాలధారణ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు, అధిక సంఖ్యలో భవానీ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక రామనగర్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా మొదలయ్యాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. దుర్గాదేవి విగ్రహాన్ని యువకులు ఊరేగింపుగా తీసుకొచ్చి రామనగర్ ప్రధానవీధి మండపంలో ప్రతిష్టించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలికలు కోలాటం, భక్తిరస గీతాలాపన అలరించారు. ఈనెల24వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటి అధ్యక్షులు లంక రాజు తెలిపారు.

జనసేన క్రియాశీల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్: జనసేన నేతలు, కార్యకర్తలకు జనసేన క్రియాశీల కిట్లను ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ సుందరపు విజయ్ కుమార్ అందజేశారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి రాక్షస పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఎలమంచిలి నుంచి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు,టెక్కలి పరశు రాం, కాళ్ల చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్,ఆడారి శ్రీకాంత్, పోలమరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీలో విజయకుమార్

రైతు వ్యతిరేక ప్రభుత్వాలను సాగనంపుదాం

ప్రజాశక్తి -అనకాపల్లి : రైతు వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అధికారం నుంచి సాగనంపితేనే అన్నదాతలకు మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభలో మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే.స్వామినాథన్ సిఫార్సులను యధాతథంగా అమలుచేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తానని నమ్మబలికిన కేంద్ర ప్రభుత్వం, వాటిని అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు.

ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘ నాయకులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ 32మంది బలిదానంతో ఏర్పాటైన ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రయివేటుకు కట్టబెట్టాలన్న కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు, నిర్వాసితులు దాదాపు వెయ్యిరోజులుగా పోరాటం చేస్తున్నా మోడీ ప్రభుత్వానికి చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, మూతబడిన చెరుకు ఫ్యాక్టరీలు తిరిగి తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, వ్యవసాయ వ్యతిరేక



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్

విధానాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 26, 27, 28 తేదీలలో విజయవాడలో మూడు రోజులపాటు ధర్నా, గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో వేలాదిగా రైతులు పాల్గొని జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

ముందుగా సిపిఐ కోడిగంటి గోవిందరావు భవన్ నుండి నెహ్రూ చౌక్, రాజా టాకీస్, వేల్పులవీధి, మీదుగా న్యూ కాలనీలోని రోటరీ కల్యాణ మండపం వరకు రైతు ప్రదర్శన నిర్వహించి, అక్కడ మహాసభ నిర్వహించారు నూకునాయుడు, లక్ష్మి, మేక సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యరకమంలో సంఘం నాయకులు రావు జగ్గారావు , డి సి హెచ్ రాజబాబు, వై.ఎన్ .భద్రం, రాజన్న దొరబాబు, గురు బాబు, వి.,కాసు బాబు, కోరుమిల్లి శంకరరావు పాల్గొన్నారు.

టిడిపికి విపక్ష హోదా గల్లంతు ఖాయం : బూడి



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి :వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రతిపక్షానికి కూడా పనికిరాకుండా టిడిపి పోతుందని డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం తారువలోని వైఎస్ఆర్ ఓపెన్ ఆడిటోరియం వద్ద వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు అధ్యక్షతన 'ఎపికి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్గవిబేధాలు లేకుండా అందరికీ సంక్షేమ అందించిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయానికి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు రుకుటి అప్పారావు, ఈర్లే అనురాధ, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రి సత్యం, కిలపర్తి భాస్కరరావు, చింతల బుల్లిలక్ష్మి, గంగాభవాని, కర్రి సూరినాయుడు,రొంగలి నారాయణమ్మ, కె.వి రమణ పాల్గొన్నారు.

పచ్చ రాతలకు చెల్లుచీటి : బూడి

కె కోటపాడు : జరుగుతున్న అభివృద్ధిని చూడలేని, చూసి హర్షించలేని స్థితిలో విపక్షాలు, పచ్చమీడియా ఉన్నాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం కె.కోటపాడులో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో మాట్లాడారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలతో ఆదుకున్న ఘనత సిఎం జగన్‌దేనన్నారు. మహిళాసాధికారితకు పెద్దపీట వేశారన్నారు. పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, రెడ్డి జగన్‌మోహన్, కె.వి రమణ, ఏటుకూరి అప్పారావు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని త్యేగాడ గ్రామంలో మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంపిటిసి తుంపాల మంగతాయారు పాల్గొని మాట్లాడుతూ, ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, సంపూర్ణ ఆరోగ్యం కోసం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వివరించారు. వెలుగు విఒఎలు మంగ లక్ష్మి. చినపావ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు



చేతులు శుభ్రం చేస్తున్న మహిళలు

'భారతరత్న' అబ్దుల్ కలామ్‌కు ఘననివాళి



కలాంకు నివాళులర్పిస్తున్న సిద్దార్థ అసోసియేషన్‌ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఎపిజె.అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక జార్జిక్లబ్ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం పూలమాల వేసి ఘన నివాళిలర్పించారు. ఈ సందర్భముగ మాట్లాడుతూ ఇస్రో చైర్మన్‌గా, దేశాధ్యక్షునిగా విశేష సేవలు అందించిన అబ్దుల్ కలామ్‌కు సేవలను కొనియాడారు.భారతరత్న కలాం అందరినీ స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయుడన్నారు.కార్యక్రమంలో సిద్దార్థ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వినకోట నీలేశ్ గుప్తా, కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వర రావు, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఇమ్మిడి శెట్టి చక్రపాణి, వాసవీ క్లబ్ సభ్యులు బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

సమున్నత వ్యక్తిత్వం అబ్దుల్ కలాం సొంతం

విశాఖపట్నం : సాధారణ వ్యక్తిగా జన్మించినా తన అకుంఠిత పట్టుదల, వ్యక్తిత్వంతో దేశం గర్వించే వ్యక్తిగా డాక్టర్ ఎపిజె అబ్దుల్ ఎదిగారని ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి జేమ్స్ స్టీఫెన్ పూలమాల వేసి నమస్కరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, డీన్‌లు ఆచార్య కె.బసవయ్య, ఆచార్య సిఎన్‌వి.సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, వర్సిటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : గొప్ప శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో ముస్లిం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో కలాం జయంతి నిర్వహించారు.మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ చిన్న రెహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ జఫురుల్లహ, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోనిచినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.గ్రామ సచివాలయ కార్యదర్శులు నూకరాజు, చొప్పా రాజు, శ్రీను, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు ఉపాధ్యాయులు సతీష్ పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ లక్ష్మి సౌజన్య

ప్రజాశక్తి -అనకాపల్లి : పచ్చని వాతావరణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జివిఎంసి 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్యరాంబాబు అన్నారు. ఆదివారం గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో గవరపాలెం శ్రీ జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. జగన్నాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ దాడి ఈశ్వరరావు మాట్లాడుతూ మన ఆరోగ్యం, ఆహార భద్రత, జీవన శైలిపై ప్రకృతి ప్రభావం చూపిస్తుందన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ, తల్లితో సమానమైన పుడమిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ, కాండ్రేగుల సాయి, బీరా వినోద్ కుమార్, మల్ల మురళి, పెంటకోట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి: రానున్న ఎన్నికల్లో వైసిపికి ఘోర పరాజయం తప్పదని మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు హెచ్చరించారు. ఆదివారం. మండలంలోని కలిగొట్ల , వేచలం గ్రామాల మధ్య రహదారిలో శారదా నది వద్ద నిర్మించిన వంతెనను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో నియోజకవర్గ నేత రాయపురెడ్డి కృష్ణ, గుమ్మడి శ్రీరామ్, ముర్రు ఈశ్వరరావు, గంట్ల వరాహమూర్తి, యాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారము పశువుల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే వేడుకలో భాగంగా గ్రామంలోని పశువులన్నింటినీ ఒకచోట చేర్చి వాటి చుట్టూ మూడుసార్లు మేళ తాళాలతో ప్రదక్షిణలు చేసి, వాటిపై అక్షతలు చల్లారు. ఇలా చేయడం వల్ల గ్రామంలోని పశుసంపద ఆరోగ్యంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, రాజి శ్రీనివాసరావు, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ పాల్గొన్నారు.

ఆదిలోనే నిలిచిన.. బాలికల వసతి గృహ నిర్మాణ పనులు

- మంజూరుకాని నిధులు - నిలిపివేసిన కాంట్రాక్టర్

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో ప్రారంభించిన బాలికల వసతి గహ నిర్మాణ పనులు నిధులు కొరత లేమితో ఆదిలోనే అర్థాంతరంగా ముగిశాయి. రూ.205.44 లక్షల ఆర్ఎంఎస్ఏ అంచనా నిధులతో బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులకు ఈ ఏడాది జనవరి 30న ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. ఈ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. బాలికల వసతిగృహం నిర్మాణ పనులు ప్రారంభించడంతో నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు ఎంతగానో ఆనందపడ్డారు. ఈ పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాల నుండి పలువురు బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా గ్రామాల నుండి బాలికలు రోజు పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వసతిగృహం



శిలాఫలకం



పునాది దశలో నిలిచిన భవన నిర్మాణ పనులు

నిర్మాణం చేపడితే చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు వసతి గృహంలో ఉండవచ్చు. అయితే భవన నిర్మాణ పనులు నిధులు కొరత లేమితో ఆదిలోనే నిర్మాణ పనులు నిలిచిపోవడంతో విద్యార్థినిలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించి, పునాది లెవెల్ వరకు మాత్రమే పనులు చేపట్టి ,పనులు నిలుపుదల చేశారు. భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేసినట్లు తెలిసింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు నాడు నేడు డిఈ ప్రసాద్ వెల్లడించారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎమ్మెల్యే గొల్ల బాబురావు దృష్టికి తీసుకువెళ్లి బాలికల వసతి గృహం పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని వైస్ ఎంపీపీ వీసం నానాజీ తెలిపారు .

పలుచోట్ల 'న్యాయానికి సంకెళ్లు' నిరసనలు



అనకాపల్లిలో..

విశాఖ కలెక్టరేట్ : నిరంతరం ప్రజలలో ఉండే వ్యక్తి చంద్రబాబు నాయుడని, అర్ధరాత్రి పూట అన్యాయంగా ఆయన్ని అరెస్టు చేయడం దారుణమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో పార్టీ ముఖ్య నాయకులు చేతులకు సంకెళ్ల మాదిరిగా రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసి 37 రోజులైందని, స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఒక్క రూపాయి అవినీతి చేసినట్టు నిరూపించలేకపోయారని అన్నారు. అరెస్టు వెనుక పెద్ద కుట్రదాగి వుందన్నారు. చంద్రబాబుకు ప్రాణహాని కూడా వుందనే అనుమానాలు బలపడుతున్నాయన్నారు.

బాబు అరెస్టును ఖండిస్తూ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరు గోవింద్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని, చంద్రబాబు త్వరగా బయటకు రావాలని కోరుతూ తెలుగు శక్తి ఆధ్వర్యంలో సంపత్ వినాయక ఆలయం వద్ద కార్యక్రమం చేపట్టారు. అధ్యక్షులు బివి.రామ్, పాలూరి శేషమాంబ, బోడేపూడి దొరబాబు, కొరారు గాంధీ, డి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పద్మనాభం : చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ ఆధ్వర్యాన న్యాయానికి సంకెళ్లకార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కె.దామోదరరావు, కె.ఎర్రినాయుడు, జి.ప్రసాద్, కెవి.సత్యనారాయణ, కె.శ్రీను, ఆర్.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : శ్రీహరిపురం హిమాచల్ నగర్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నక్క లక్ష్మణరావు, మిత్తిరెడ్డి శంకర్, లాలం లావణ్య, రామ్మోహన్‌నాయుడు, దేవర ఈశ్వరరావు, ఉరుకూటి డేవిడ్, పోల్‌రెడ్డి, జయశంకర్, చింతలపూడి సత్యనారాయణ, శివ, డొప్ప సన్యాసులు, పాల్గొన్నారు.

పిఎం పాలెం : తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన పిఎం పాలెం రెండవ బస్ స్టాప్ వద్ద న్యాయానికి సంకెళ్లకార్యక్రమం చేపట్టారు. టిడిపి అభిమానులు చేతికి సంకెళ్ల వేసుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, బాబ్జీ, రామకృష్ణ, రౌతు వెంకటరమణ, పెడల శ్రీను, పెంటకోట బబ్బెలు, బాషా, రెడ్డి పాపయ్య పాల్గొన్నారు.

భీమునిపట్నం : 3వ వార్డు కమిటీ ఆధ్వర్యాన న్యాయానికి సంకెళ్ల పేరిట పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక బీచ్‌లో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు చురకల రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.అప్పారావు, జి.పోలిరాజు, పైడిపల్లి నరసింగరావు, వియ్యపు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : 11, 12, 13 వార్డుల టిడిపి నాయకులు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు, ఒమ్మి అప్పలరాజు, పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రనభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తురకపూడి బాలస్వామి, యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి, ఎ.అప్పలనాయుడు, మూది అప్పారావు, ఆదినారాయణరాజు, ఎం.కృష్ణంరాజు పాల్గొన్నారు.

కశింకోట : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ, బాబుకు సంఘీభావంగా టిడిపి అధిష్టానం



గొలుగొండలో సంకెళ్లతో నిరసన చేపడుతున్న నేతలు

పిలుపుమేరకు ఆదివారం కశింకోట గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో న్యాయానికి సంకెళ్లు అనే వినూత్న నిరసన చేపట్టారు. ఆదివారం సాయంత్రం పెద్దఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొని, తాళ్లతో చేతులను కట్టుకుని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కశింకోట తెలుగుదేశం పార్టీ నాయకులు
వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, ఆడారి నరిసింగరావు ,మళ్ల లోవకృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి : చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి నేతలు, కార్యకర్తలు చేతులకు తాళ్లతో సంకెళ్లు వేసుకుని మోకాళ్లపై నిరసన చేపట్టారు. చంద్రబాబు అరెస్ట్, రిమాండ్‌తో న్యాయానికి సంకెళ్లు పడినట్టేనన్నారు. అధిక సంఖ్యలో టిడిపి నేతలు పాల్గొన్నారు.

గొలుగొండ:చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆదేశం మేరకు గొలుగొండ మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, జిల్లా బీసీ సాధికార కమిటీ రమేష్ ఆధ్వర్యంలో న్యాయానికి సంకెళ్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ సెక్రెటరీ పోతిన లోవరాజు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు గండేపల్లి రాము, కార్యకర్తలు పాల్గొన్నారు. పాత మల్లంపేట సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి, ఆనంద్, సిహెచ్.నాగాపురంలో మాజీ సర్పంచ్ కె.రామారావు ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. అదే విధంగా యర్రవరం, కొమిర తదితర గ్రామాల్లో నిర్వహించారు.



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి- నక్కపల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2002-2003 లో పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన నక్కపల్లి పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.చిన్ననాటి తీపి జ్ఞాపకాలను, చేదు అనుభవాలను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, ఆడిన ఆటలు, గురువులు బోధించే తీరు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పాఠశాల మైదానంలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. తమకు విద్యనేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు.



అవగాహన కల్పిస్తున్న దమయంతి

గ్రంథాలయంలో శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో గల శాఖా గ్రంథాలయంలో దసరా సెలవుల నేపథ్యంలో శిక్షణ శిబిరాన్ని నారాయణమూర్తి మాస్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. శిక్షణ తరగతులతో కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. శిక్షణ శిబిరంలో భాగంగా బుక్ రీడింగ్, కథలు చెప్పే కార్యక్రమం నిర్వహించారు. పి.ప్రభాకరరావు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా శాఖా గ్రంథాల యధికారి పి దమయంతి పిల్లలు పాల్గొన్నారు.



సామగ్రి ఇస్తున్న సర్పంచ్

పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- రావికమతం:మండలంలోని కవగుంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, కీర్తిశేషులు దాసరి రామనాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు 10 రకాల విద్యా సామగ్రిని కోడలు, సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, సచివాలయ కన్వీనర్ వరహాలు మాట్లాడుతూ, దాసరి రామనాయుడు కవగుంట గ్రామానికి మూడు పర్యాయాలు సర్పంచిగా పనిచేసి అనేక సేవలు అందించారన్నారు. గ్రామానికి ప్రాథమిక పాఠశాల, రామాలయం, రక్షిత మంచినీటి పథకం, మంచినీటి బోర్లు, రచ్చబండలు, చెక్ డాముల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ప్రగడ నాయుడు బాబు, కోఆపరేటివ్ డైరెక్టర్ చిన నాగరాజు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సారూ.. మా గోడు వినండి

677వ రోజుకు మత్స్యకారుల మహా ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి:హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైను ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని, తమ ఆవేదన, గోడును సీఎం సార్ వినాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా 677వ రోజుకు చేరింది. మత్స్యకారులు చేస్తున్న ధర్నాలో ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మద్దతును తెలియజేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు 677వ రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి నేటి వరకు మార్గం చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా పర్యటనకు సోమవారం సీఎం జగన్మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్ కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ ఏర్పాటు చేసిన దగ్గర నుండి కంపెనీ నుండి వెలువడే వ్యర్థ రసాయన జలాలు సముద్రంలోకి వదలడంతో చేపలు వృద్ధి లేకపోవడం తో తామంతా ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ కాలుష్యం కారణంగా కేన్సర్, ఊపిరితిత్తులకు చెందిన వ్యాధులు బారిన పడి అనేక మంది మత్స్యకారులు మరణించారని, అనేక మంది వైద్యం కోసం లక్షల రూపాయలు అప్పు లు చేసి ఆసుపత్రి చుట్టూ తిరగవలసి వస్తుందన్నారు. మరో కొత్త పైపులైను వేసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.కొత్త పైపులైన్ ఏర్పాటు తమ ఉనికికే ప్రమాదమని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు చేపలు సోమేష్, గోసల సోమేశ్వరరావు, మొలపల్లి బైరాగి రాజు, బొంది నూకరాజు, కొత్వాల్ కాశి, బొంది సతీష్, ముడి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న అప్పలరాజు, మత్స్యకారులు


భయం భయంగా వెళుతున్న వాహనదారుడు

రహదారిపైనే మెటల్, ఇసుక

ప్రజాశక్తి-కోటవురట్ల: నిత్యం రద్దీగా ఉండే మండల పరిషత్ కార్యాలయ ఆవరణ ప్రధాన ద్వారం వద్ద నిర్మాణం చేపడుతున్న ప్రధాన గేటు మెటీరియల్ దారికి అడ్డంగా రహదారిపై వేయడంతో కార్యాలయాలకు వెళ్లి వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెటల్ పిక్కలు రోడ్డుపై ఉండటంతో వాహనదారులు కొన్ని సందర్భాల్లో జారీ పడిపోవడంతో గాయాలు పాలవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారికి అడ్డంగా ఉన్న మెటీరియల్ తొలగించాలని కోరుకుంటున్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-రావికమతం:చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దాసరి సూర్య కుమారి, సచివాలయ కన్వీనర్ వరహాలు సూచించారు. మండలంలో కవగుంట గ్రామంలో హ్యాండ్ వాష్ డే సందర్భంగా చేతులను సబ్బుతో పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, నాయుడు బాబు, రాము తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

శ్రీనివాసరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి- చీడికాడ: అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బొడ్డు శ్రీనివాసరావుని చీడికాడ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన స్వగృహంలో ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ, శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించారని, దీన్ని గుర్తించి అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించడం హర్షించదగ్గ విషయమని ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు నక్క జోగారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ి పరదేశి పాల్గొన్నారు.


ఖో ఖో ఆడుతున్న క్రీడాకారులు

శ్రీ ప్రకాష్‌లో ఖోఖో పోటీలు

ప్రజాశక్తి -పాయకరావుపేట:విద్యార్థులకు క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ తెలిపారు. స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలలో సిబిఎస్ఇ 7 ఖో ఖో పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుండి సుమారు 1200 మంది క్రీడాకారులతో ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలు బాలుర, బాలికల విభాగంలో అండర్ 19 కేటగిరీ లో మూడు రోజుల పాటు జరగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. 17న గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం జరుగుతుందని అయన తెలిపారు. ప్రారంభ మ్యాచ్ బాలికల విభాగంలో ఫోర్ట్ సిటీ స్కూల్ (విజయనగరం) విజయం సాధించింది. పలు మ్యాచ్‌లలో వివిధ స్కూళ్లు విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఈ అబ్జర్వర్ జి.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ, నీళాదేవి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:అనకాపల్లి జిల్లా కు 16 న పర్యటన కు వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనకాపల్లి జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు.అనకాపల్లి జిల్లా లో నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల ప్రభావం కారణంగా ఖరీఫ్ సీజన్ లో వరి సాగు గణనీయంగా తగ్గిందని, జిల్లాలో కరువు తాండవిస్తుందని, కరువు దృష్ట్యా సీఎం ప్రకటన చేయాలన్నారు. మండలంలో ఆదివారం ఒడ్డిమెట్ట, చినరాంభద్రపురం గ్రామాల్లో రైతులతో కలిసి ఖాళీగా ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్ లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 5,125 ఎకరాలు గాను, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం 1,219 ఎకరాల్లో మాత్రమే రైతులు అష్ట కష్టాలు పడి వరి సాగు చేయగలిగారన్నారు. అనకాపల్లి జిల్లా లో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు గాను, లక్ష ఆరువేల ఎకరాల్లో (78 శాతం) మాత్రమే పంట పంట నమోదైందన్నారు. సెప్టెంబర్ 30 వరకు పంట సాగు నమోదు చేసినా 78 శాతానికి మించి సాగుకాలేదన్నారు. పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో సగం కూడా పంట నమోదుకాలేదన్నారు. వర్షాల్లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కరువును పరిగణనలోకి తీసుకొని స్వల్ప కాలిక పంటలకు విత్తనాలు రైతుకు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బి.రాము, రైతులు బి.శివ గణేష్, పి.నూకన్ననాయుడు, పి.వెంకటగణేష్, పి.విఘ్నేశ్వరుడు, పి.సత్తిబాబు పాల్గొన్నారు.

పెట్టుబడి కష్టమే...!

-వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు
- ముదిరిన నారు, అధికంగా పెట్టుబడులు
-ఆందోళనలో రైతన్నలు


నీరు లేక ఎండుతున్న వరి

ప్రజాశక్తి-రోలుగుంట:

మండలంలో వర్షాధారంపైనే వరిసాగుకు ఆధారం. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడటంతో మండల రైతాంగం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల సాధారణ విస్తీర్ణం 1300 హెక్టార్లు. ఈ ఏడాది ఖరీప్‌లో ఆగస్టు చివరి వారంలో 530 హెక్టార్లు సాగు కాగా మరో 100 హెక్టార్లలో సెప్టెంబర్ చివరి వారంలో అడపా డదపా కురుస్తున్న వర్షాలకు సాగు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రారంభం నుండి చెరువుల్లో నీరు చేరకపోయినా వాగులు, వంకలు, కొండల్లో పారిన నీటితో వరి నాట్లు వేయడం జరిగింది.

మండలంలో శరభవరం, బుచ్చంపేట, రత్నంపేట, కంచుగుమ్మల, కొమరవోలు గ్రామాల్లో ముందుగా నాట్లు వేశారు.మధ్యలో కొన్నాళ్లు ఎండినా సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు తట్టుకొని సెప్టెంబర్ మాసంలో వేసిన ఆట్లు కంటే కొంత మెరుగ్గా ఉందని రైతులు అంటున్నారు. ఆగస్టులో వేసిన వ రి నాట్లకు సెప్టెంబర్ చివరి దలో వేసిన నాట్లు, వరినారు ముదిరిపోవడంతో దిగబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయితే పెట్టుబడి మాత్రం రెండింటికి తేడా వేరు. ఆగస్టులో వేసిన నాట్లకు వరి విత్తనాలు వేసిన దగ్గర నుండి దమ్ముకు నాట్లు వేసి పొట్ట దశకు వచ్చేసరికి ఎకరాకు సుమారు 30వేల రూపాయలు అయిందని, అలాగే ఆలస్యంగా వేసిన నాట్లకు పెట్టుబడి ఒక్కటే అవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతుంది. గతంలో ఈ ప్రాంతంలో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 25 బస్తాలు మాత్రమే వస్తుందని, ఆలస్యంగా వేసిన నాట్లకు 10 బస్తాలు కూడా రాదేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు ఎక్కువగా కాయడంతో తెగుళ్ల బారిన గురుతున్నాయని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాయత్రీదేవికి ఘన సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి:విష్ణు సహస్రనామ స్తోత్రంలో వున్న 1008 నామాలకు ఒక్కో నామానికి ఒక్కో పద్యం చొప్పున డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి రచించిన విష్ణు సహస్రనామ పద్యమాలిక గ్రంథావిష్కరణ ఆదివారం ఉపమాక వెంకన్న సన్నిధిలో ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఎంతోమంది పండితులు, కవులు, అష్టావధానులు ఈ గ్రంథావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇప్పటి వరకూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎవరూ చేయని విధంగా డాక్టర్ గాయత్రీదేవీ విష్ణు సహస్రనామ స్తోత్రంలో ఒక్కో నామానికి ఒక్కో పద్యం రాయడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రపద్య కవితా సదస్సు, పండిత, రచయితల సంఘాల ప్రతినిధులు, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి తోపెల్ల బాల సుబ్రహ్మణ్యశర్మ, ఆంధ్రపద్య కవితా సదస్సు అధ్యక్షులు కోటారావు, మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు, సిలికాన్ ఆంధ్ర ఆచార్యులు, అద్దంకి శ్రీనివాస్, డాక్టర్ విష్ణుమూర్తి, నండూరి జయలక్ష్మి, చిన్నయ్యపల్లి వరలక్ష్మి, డి. రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు ఇస్తున్న దాతలు

పిల్లలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురం అడ్డురోడ్డులో జె.డి కలెక్షన్స్ అధినేత జగదీష్ విజయదశమి సందర్భంగా అనాధ పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో అనాధ ఆశ్రమంలో తన తల్లిదండ్రులు మల్లి కనకయ్య, దనమ్మ చేతుల మీదుగా కొత్త బట్టలు పంపిణీ చేసినట్టుగా ఆయన తెలిపారు.అనాధ శరణా లయాన్ని నడిపిస్తున్న కిరణ్ దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జె డి జగదీశ్ పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎంపిపి

ఎంపిపి పర్యటన

ప్రజాశక్తి-రోలుగుంట:ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు ఆదివారం రోలుగుంట ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు కొవ్వూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగువ వార్డు పరిధిలో ప్రజలు కోరిక మేరకు మురికి నీటిని బయటకు పంపించి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో రేవు పోలవరం గ్రామంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు ట్రస్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యకులు బంగారు చిట్టి తెలిపారు. ఆదివారం ఈ వైద్య శిబిరానికి బీజేపి రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మెడికల్ క్యాంప్ ను ప్రారంభించారు. మహాత్మగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యుల బృందం 120 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. లక్ష్మి గాయిత్రి హాస్పిటల్ వైద్యుల బృందం 220 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేశారు.హైమా కంటి హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

పది లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో చిన్న కుందాంపేటలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు.పి .పొన్నవోలు పంచాయతీ చిన్న కుందాంపేట గ్రామానికి చెందిన గంజి ఈశ్వరరావు వద్ద పది లీటర్లు నాటు సారాను, బైక్ ను సీజ్ చేసినట్లు తెలిపారు.